Andhra Jyothy     Dt 20/09/18.



# 'మెట్రో'కు కౌంట్‌డౌన్

హైదరాబాద్ సిటీ/ఎల్‌బీనగర్/ఖైరతాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ మార్గంలో మెట్రో పనులు కొనసాగుతున్నాయి. పైన మెట్రో రైళ్ల ట్రయల్ రన్స్ జరుగుతుంటే, కింద ఫుట్‌పాత్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ మార్గంలో మెట్రో రైళ్లను ప్రారంభించేందుకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో పెండింగ్‌లో ఉన్న పనులను శరవేగంగా పూర్తి చేసే పనిలో మెట్రో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన మియాపూర్-అమీర్‌పేట, నాగోల్-అమీర్‌పేటల మెట్రో కారిడార్‌లలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల సుందరీకరణలు కొనసాగుతున్నాయి. స్థలాల అందుబాటును బట్టి ఫుట్‌పాత్‌లపై ఫ్లోరింగ్, గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చెట్లు ఉన్న ప్రాంతాల్లో అందంగా నిర్మాణాలు చేపడుతున్నారు.


చైతన్యపురి స్టేషన్ వద్ద కొనసాగుతున్న ఫుట్‌పాత్ పనులు

### లక్డీకాపూల్‌లో పెండింగ్‌లో ఫుట్‌పాత్ పనులు..

లక్డీకాపూల్ మెట్రోస్టేషన్ వద్ద స్టేషన్ లోపలి పనులు దాదాపు పూర్తైనా కింది భాగంలో ఫుట్‌పాత్ పనులు కొనసాగుతున్నాయి. ఇరువైపులా ప్రయాణికులు మెట్లు దిగే ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై గ్రానైట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్‌స్టాప్ పక్కనున్న వైపు ఫ్లోరింగ్ పనులు పూర్తి కాగా మరోవైపు సిమెంట్ కాంక్రీట్ పనులు జరుగగా గ్రానైట్ వేయాల్సి ఉంది. ఇక్కడ ఫుట్‌పాత్‌పైన ప్రయాణికులు నడిచేందుకు వీలుగా వసతులు కల్పించడంతోపాటు రోడ్డు పక్కన గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు.

### ఖైరతాబాద్‌లో వేగంగా..

ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ వద్ద రెండు వైపుల ఫుట్‌పాత్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మెట్రో ప్రయాణికులు ఏవైపు నుంచి అయినా కిందకు దిగేలా రెండు వైపులా మెట్ల నిర్మాణం పూర్తి కాగా ఓ వైపు ఫుట్‌పాత్‌పై ఫ్లోరింగ్ పనులు పూర్తయ్యాయి. మరోవైపు ఫుట్‌పాత్ కోసం సిమెంట్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ రైల్వేస్టేషన్ లోపలి భాగంలో కూడా ఇంకా కొన్ని పనులు పూర్తి కావల్సి ఉంది. వేగంగా ఈ పనులను జరుపుతూ మరో ఐదు రోజుల్లో పనులు పూర్తి స్థాయిలో జరిపేందుకు అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు.

### మెట్రో స్టేషన్ల వద్ద పనుల తీరు..

- ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద రేలింగ్ పనులు పూర్తి చేసి, ఫుట్‌పాత్‌పై టైల్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- విక్టోరియా మెమోరియల్ స్టేషన్‌కు ఇరువైపుల టైల్స్ వేయడంతో పాటు గ్రిల్స్ బిగించారు. స్టేషన్‌కు కొద్ది దూరంలో ఫుట్‌పాత్ టైల్స్ పనులు చేస్తున్నారు.
- చైతన్యపురి మెట్రోస్టేషన్‌కు ఇరువైపుల గ్రిల్స్ వేశారు. టైల్స్ పనులు పురోగతిలో ఉన్నాయి.
- దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్ పరిధిలో ఎక్కడా పనులు జరగడం లేదు, ఇరువైపుల గ్రిల్స్ కూడా పూర్తిగా బిగించలేదు. ఒకవైపు ఫుట్‌పాత్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- ముసారంబాగ్ మెట్రోస్టేషన్ వద్ద గ్రిల్స్ స్టేషన్ పరిధి వరకు వేశారు. ప్రస్తుతం మ్యాన్‌హోల్స్ పనుల సాగుతున్నాయి. ఇంతవరకు స్టేషన్ పరిధిలో ఎక్కడా టైల్స్ వేయలేదు.
- న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ వద్ద గ్రిల్స్ పనులు కొనసాగుతున్నాయి. టైల్స్ కొద్ది దూరం వరకు వేశారు. మార్కెట్‌కు ఒక వైపు మాత్రమే పనులు సాగుతున్నాయి. మరోవైపు పనులు జరగడం లేదు.
- మలక్‌పేట మెట్రోస్టేషన్ పరిధిలో ఎటువంటి పనులు జరగడం లేదు. గ్రిల్స్, టైల్స్ పనులు సక్రమంగా జరుపకుండా అసంపూర్తిగా వదిలేశారు.

మెట్రో రైలు

## ఎల్‌బీనగర్ వాసుల
# కల సాకారమవుతోంది

- ఆరేళ్లుగా కొనసాగిన మెట్రో పనులు
- ప్రత్యేకంగా కారిడార్-1
- అసెంబ్లీ నుంచి ఎంజీబీఎస్ వరకు చరిత్రాత్మక నేపథ్యం
- రెండు ఇంటర్‌చేంజ్ స్టేషన్లు
- ఎంజీబీఎస్, నాంపల్లి రైల్వే స్టేషన్లతో అనుసంధానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మహానగరానికి మణిహారం హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు. అలాంటి ప్రాజెక్టు పనులు ఎల్‌బీనగర్‌లో 2012లో ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మెట్రో రైలు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూశారు. వారి ఎదురు చూపులు ఎట్టకేలకు నిజం కానున్నాయి. ఈనెల 24 నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. మెట్రో ప్రాజెక్టులోనే అత్యంత కీలకమైన, ప్రత్యేకమైందిగా కారిడార్-1కు గుర్తింపు వచ్చింది. నగరానికి ఒక చివర నుంచి మరో చివరి వరకు మెట్రో రైలు ప్రయాణం చేసేలా 29 కి.మీ దూరంతో కారిడార్‌ను నిర్మించారు. మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ వరకు ఉన్న మార్గంలో ఎన్నో చెప్పుకోదగిన ప్రత్యేకతలు ఉన్నాయి. శాసనసభ, హైదరాబాద్ (నాంపల్లి) రైల్వేస్టేషన్, ఆసియాలోనే అతి పెద్దదైన ఎంజీబీఎస్, కోఠి ఉమెన్స్ కాలేజ్‌లతో పాటు అటు కొత్త నగరాన్ని, ఇటు పాత నగరమైన కోఠి, చాదర్‌ఘాట్, మలక్‌పేట ప్రాంతాలను కలుపుతూ ఎల్‌బీనగర్ వరకు ఉన్న ఈ మార్గం నగరంలో అత్యంతర రద్దీతో కూడుకున్నది.

### మెట్రోతో మియాపూర్ దశ మారింది..

మెట్రోరైలు ప్రాజెక్టుతో మియాపూర్ దశ మారింది. 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మియాపూర్ మెట్రో డిపోతో పాటు మెట్రోస్టేషన్, మరో పదెకరాల్లో విశాలమైన స్థలాల్లో ప్రత్యేక నిర్మాణాలతో మియాపూర్ దశ మారిపోయింది.

### హైలెట్‌గా నిలవనున్న ఇంటర్‌చేంజ్ స్టేషన్లు...

కారిడార్-1లో మొత్తం 27 మెట్రోస్టేషన్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో అమీర్‌పేట, ఎంజీబీఎస్ ప్రాంతాల్లో ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లను భారీ స్థాయిలో నిర్మించారు. రెండు వేర్వేరు కారిడార్ల నుంచి వచ్చే మెట్రో రైళ్లు కలిసేలా ఈ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లను అత్యాధునిక మౌలిక వసతులతో చేపట్టారు. ఒకేసారి 40 వేల మంది ఈ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌ల నుంచి నిత్యం రాకపోకలు సాగించే నిర్మించారు. ఇప్పటికే అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ స్టేషన్ హైలెట్‌గా నిలవగా ఎంజీబీఎస్ ఇంటర్‌చేంజ్ స్టేషన్ అదే స్థాయి లో ఉండనుంది. కారిడార్-1తో కారిడార్-3 అమీర్‌పేట వద్ద కలుస్తుండగా, కారిడార్-2 ఎంజీబీఎస్ వద్ద కలుస్తోంది. దీంతో కారిడార్-1లో ప్రయాణించే వారు కారిడార్-2, కారిడార్-3 సులభంగా మారే అవకాశం ఉంది.

### మధ్యాహ్నం నుంచి ఎల్‌బీనగర్‌కు మెట్రో....

ఈనెల 24న రాష్ట్ర గవర్నర్ ఎల్‌బీనగర్ మెట్రో రైలును అమీర్‌పేట నుంచి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మెట్రో రైలుకు పచ్చా జెండా ఊపిన తర్వాత కొన్ని గంటల తర్వాతే మెట్రో రైళ్లలోకి ప్రయాణికులను అనుమతిస్తారు.

## దేశంలోనే రెండో అతి పొడవైన
# మెట్రో మార్గం

- 46 కి.మీ మేర అందుబాటులోకి
- ప్రతి 5 నిమిషాలకో రైలు
- 52 నిమిషాల్లో 29 కి.మీ ప్రయాణం
- అమీర్‌పేటలో గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభం
- మెట్రో ఎం.డి ఎన్వీఎస్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ మెట్రో తర్వాత అతి పొడవైన మెట్రో మార్గం హైదరాబాద్ మహానగరంలో అందుబాటులోకి వస్తోందని మెట్రో ఎం.డి ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. మెట్రో మొదటి దశలో అత్యంత కీలకమైన కారిడార్-1ను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తుండడంతో ఒకేసారి 46 కి.మీ. మేర మెట్రో రైళ్లు పరుగులు పెడతాయన్నారు. ఇది దేశంలోని ఇతర మెట్రోల కంటే పొడవైనదని అన్నారు. కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ వరకు ఉన్న 29 కి.మీ దూరాన్ని మెట్రోలో కేవలం 52 నిమిషాల్లో చేరుకోవచ్చని, అదే రోడ్డు మార్గంలో అయితే 2 గంటల సమయం పడుతుందన్నారు. ఈ మార్గంలో ప్రతి 5 నిముషాలకో మెట్రో రైలు నడిచేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఈ.ఎస్.ఎల్.నరసింహన్ అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ నుంచి జెండా ఊపి ఎల్‌బీనగర్ వరకు మెట్రోను ప్రారంభిస్తారని తెలిపారు. గత కొన్ని నెలలుగా కారిడార్-1లో కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ (సీబీటీసీ) విధానాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. అంతిమంగా కేంద్ర రైల్వే శాఖ పరిధిలోని కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ అధికారుల బృందం రకరకాల పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను జారీ చేశారని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు పూర్తి స్థాయిలో చేపట్టి, అవి సంతృప్తికరంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఆయా తనిఖీ సంస్థలు సర్టిఫికెట్లు ఇచ్చాయన్నారు. హైదరాబాద్ మెట్రోలో అత్యాధునిక మౌలికవసతులతో పాటు అత్యంత పటిష్ఠమైన భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.